# పెద్దకథ:

జానకి నవ్వింది.

తలవారగా వంచి పళ్ళు కన్పించకుండా —పెదాల్ని అందంగా సాగతీసి శబ్దం కాకుండా నవ్వింది. నవ్వినపుడు బుగ్గలు ఎరుపు రంగులు పులుముకుని— సొట్టలు పడినయి.

ఆమె బుగ్గల నిగ్గులు చూస్తూ పరవశించాడు మూర్తి.

'నవ్వు నీలో కొత్త అందాల్ని సృష్టిస్తోంది జానకీ!' అన్నాడు.

'పొగడ్తలొద్దు. పొద్దుపోతోంది. ఇక నే వెళ్తాను.' వాచీ చూసుకుంటూ అన్నది.

'ఇది పొగడ్తగాదు. నిన్ను పొగిడి ప్రసన్న పరుచుకోవాలనే దురభిప్రాయం నాకులేదు!' కొద్దిగా చిన్నబుచ్చుకున్నాడు.

'యు.... సిల్లీమూర్తి! నా అందం— నా అంతస్తు నాకు తెలుసు. అదేదో గొప్ప విషయమైనట్లు నాకు తెలియనట్లు కామెంట్ చేస్తుంటే విసుపుగా వుంటుంది. కోపంగా కూడా వుంటుంది. ఇంక ప్రపంచంలో మాట్లాడుకొనే విషయాలేవీ లేనట్లు అల అంటుంటే కృతకం అనిపిస్తుంది.'

మూర్తి మౌనం వహించాడు.

'కోపం వచ్చిందా?'

'ఊహూ!'

'రక్షించావు! నిన్నెలా ప్రసన్నం చేయాలా అని హడలి చస్తున్నా!' నవ్వింది.

'నాపై నీకు ఇంత సున్నితమైన అభిప్రాయం వుందన్న మాట!' ఆమె ముఖం లోకి చూస్తూ అన్నాడు.

'అబ్బ! అదిగో.... మళ్ళీ విస్తరమాడుతున్నావు. ఇంక నేను వెళ్తాను బాబూ!' లేచి నిలబడింది జానకి.

మూర్తి దూరంగా ఎటో చూస్తూ వూరుకున్నాడు.

'నువ్వు కాసేపు వుంటావా? మంచిది! మళ్లీ ఎప్పుడు కలుద్దాం?' అడిగింది జానకి

'ఆ ప్రశ్న నేనూ వేయవలసింది!' అన్నాడు నవ్వటానికి ప్రయత్నం చేస్తూ.

'రేపు ఆదివారం కదా! ఈ వారం నుంచీ అశ్రద్ధ పడిన పనులన్నీ రేపటికి సిద్ధంగా వుంటాయి! ఇంక ఇల్లు కదలాలంటే తగని బద్ధకం అనిపిస్తుంది. సోమవారం మళ్ళీ ఆఫీసు మొదలు! వీలుంటే మంగళవారం







మానవ సేవయే మా లక్ష్యం :
ఉచిత సత్‌సాహిత్యం కోసం:
"ధర్మవిజయము" కేంద్రం
పోష్టు బాక్సు నెం. 1654,
సికింద్రాబాదు - 3.

35 సం॥ అనుభవం
వరిబీజము బుడ్డలు బీజకుట్లు
మొదలగు వ్యాధులకు ఆపరేషన్
లేకుండా గ్యారంటిగా బాగుచేయబడును
వివరములకు:
రా అండ్ కో ఆసుపత్రి
గౌలిగూడ నయబస్ డిపో ఎదుట,
రామ్ మందిర్ రోడ్, హైదరాబాద్-12 ఆ.ప్ర
ఆఫీస్ ఫోన్: 42870 ఇంటి ఫోన్: 38544
Asian

బేబీటోన్
గ్రైప్ మిక్స్చర్




-బంతాచేసి యేడాదే. ఇంతలోనే ఆరు పళ్లు వచ్చేశాయి. ఎంతో సరదాగా వున్నాడు.
ఆరోగ్య సూచకమైన ఆకలి. గాఢ నిద్రపోతాడు.
కాని కడుపునొప్పా?
అది తగ్గటం ఎంతోసేపు కాదులెండి.
బేబీటోన్ గ్రైప్ మిక్శ్చర్‌కు ధన్యవాదాలు
ప్టాకిస్టు: ABC వారి ఉత్పత్తి
అమర్‌శోభ పోస్టు బాక్సు 518. మద్రాసు-3
పోస్టు బాక్సు 16460 బొంబాయి-16

# అరిటాకు—ముల్లు

సాయంత్రం ఇదే టైముకు! సరేనా? బై బై.' హైహీల్సు టకటకలాడించుకుంటూ వెళ్ళిపోయింది జానకి. ఆమె కనుమరుగయే దాకా చూసి నిట్టూర్చాడు మూర్తి.

పడమటి దిశలో క్రుంగిపోతున్న, సూర్యుడు బంగారు రంగును పులుముతున్నాడు మేఘాలకు. నెమ్మదిగా— ప్రశాంతంగా ప్రవహిస్తోన్న నదిలో అక్కడక్కడ కొంగలు ఆహారాన్ని అన్వేషిస్తున్నాయి. గట్టు మీద కూర్చునివున్న మూర్తిలో చైతన్యమంతా ఘనీభవించినట్లు స్తబ్ధత ఏర్పడింది.

'అనేకసార్లు తన మనసును గాయపరిచింది జానకి. అయినా ఆమె సాంగత్యాన్ని దూరం చేసుకోలేకపోతున్నాడు. సాయంత్రం అవుతూనే— ఆఫీసు నుంచి ఈ నదిఒడ్డుకు రాకుండా వుండలేని బలహీనత ఏర్పడిపోయింది. జానకి తప్పకుండా వస్తుంది! అనే ఆరాటం మనసును డోలికలా వూపి—హాయిని నింపుతుంది! జానకి ఆగమనంతో తనలోని ప్రత్యణువూ నవచైతన్యంతో పొంగిపోతుంది. ఈ భావాలన్నీ జానకికి విప్పి చెప్పాలనిపిస్తుంది. అందమైన సాయంత్రాలు ఆమెతో మాట్లాడుతూ గంటల కొద్దీ గడపాలనిపిస్తుంది. ఆమె కళ్ళల్లోని మెరుపులో తన ప్రతిబింబం చూడాలనిపిస్తుంది. ఆమె మధురమైన మందహాసంతో జతకలపాలనిపిస్తుంది. కానీ.... ఇవేమీ చెయ్యలేడు తను. కాదు.... కాదు.... జానకి అవకాశమివ్వదు. ఎక్కడికక్కడ తన ఉత్సాహాన్నీ—ఆరాటాన్నీ—ఆసక్తినీ—ఆరాధన్నీ తెంపేస్తుంది. ఏదో ఒక పుల్లవిరుపు మాటతో మనసు సీరవంగా మారిపోయి— చెప్పాలనుకున్నవన్నీ ఏ మూలకో పారిపోతాయి. అడగాలనుకున్నవన్నీ గుర్తే వుండవు! అంతా శూన్యం అనిపిస్తుంది. అంతమటుకు జగత్తు అంతా కొత్త అందాలతోనూ— వింతసోయగంతోనూ— పలకరిస్తున్నట్లు పులకరించే తనకు— ఆ క్షణాన చైతన్యం లేని జడపదార్థం అనిపిస్తుంది. సౌందర్య రహితమనిపిస్తుంది. జానకి ఎందుకలా వింతగా ప్రవర్తిస్తుందో తనకు అవగాహన కావటంలేదు. తనంటే ఇష్టంలేదేమో అనే సంశయం ఎన్నోసార్లు వేధించింది కూడా. ఇష్టంలేకపోతే ఎప్పుడు కనిపించినా— నవ్వుతూ ఎందుకు పలకరిస్తుంది? ఆ నవ్వులో ఎన్నో అర్థాలు కనిపిస్తాయి. అన్నిటినీ మించి జానకిని చూడకుండా—ఆమెతో సాయంకాలాలు గడపకుండా వుండలేని పరిస్థితి కొచ్చాడు తను. ఆమె వస్తానన్న రోజు కోసం— వెన్నెలకోసం ఎదురు చూసే చాతకపక్షిలా ఎదురుచూస్తాడు. జానకి వచ్చే టైము దగ్గర పడుతున్నకొద్దీ— గుండె స్పందిస్తుంది. మనసు పులకరిస్తుంది, వూహలతో వుక్కిరిబిక్కిరిఅవుతుంది. ఇవన్నీ ప్రేమ లక్షణాలు కావా? ఎందుకు కావు? జానకిని మనసా వాచా ప్రేమిస్తున్నాడు. ఆమె కిష్టమైతే పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు. ఇవాళకాకపోతే రేపైనా ఆమెతో ఈ విషయాన్ని చెప్పాలి. ఆమె అభిప్రాయం తెలుసుకోవాలి.' అనుకున్నాడు ధృఢనిశ్చయంగా మూర్తి. మనసు తేలికపడింది. హుషారుగా లేచి ఈల వేసుకుంటూ ఇంటి ముఖం పట్టాడు.

* * *

'ఊ!.... ఇంతకీ నీ వెంట మూర్తిని కుక్కలా తిప్పుతున్నావన్న మాట!' అన్నది సళిని.

'తిప్పటంలేదు! తిరుగుతున్నాడు' అన్నది సవరింపుగ జానకి.

"ఏద్పైతేనేం? ఇది మంచిపని కాదమ్మాయ్! నీ కిష్టమైతే ఇష్టమైనట్టు వుండు. లేదా నీ మనసులోని అభిప్రాయాన్ని క్లియర్‌గా చెప్పేయ్. అబ్బాయ్! ఇదీ సంగతి!! అని. అంతేగానీ ఈ ముసుగులో గుద్దులాట ఎందుకు?"

"ముసుగులేదూ- ఏమీలేదు. ఎప్పటికప్పుడు అతని మాటల్ని త్రుంచివేస్తూ 'నాకాట్టే నీ మాటలు ఇంపుగా లేవు.' అని తెలియ జేస్తూనే వున్నాను. పూర్ ఫెలో! అర్థం చేసుకోడే?"

'నేనొకటి చెప్తాను వింటావా జానకీ?'

'వింటూనే వున్నాగా!...... చెప్పు!'

'నిన్ను అంత పిచ్చిగా ఒతను ఆరాధిస్తుంటే— కాదనటమెందుకు? అలాంటివాడినే చేసుకుంటే సుఖపడతావు కూడా!'

జానకి ముఖం ఎరుపురంగు పులుముకుంది. కళ్ళల్లోకి తీవ్రత వచ్చేసింది.

'ఆచవలని చేసుకుంటే జీవితంలో' త్రిల్ చచ్చి వూరుకుంటుంది. అంతకంటే ఇలానే వుండిపోవడం హాయి!'


"అతనితో స్నేహం ఇంక పెంచుకోకుండా వుండటం శ్రేయస్కరం. ఈసారి కలుసుకున్నప్పుడు కుండబద్దలు కొట్టినట్లు కాక— కాస్త నెమ్మదిగా చెప్పు. అతవంటే నీ కయిష్టమని— షాక్ కాకుండా...'

'షాకా—పాడా! నేనుకాకపోతే మంకరు. చూస్తాండు ఈ మగవాళ్ళ కల్లబొల్లిమాటలు నమ్మేదెవరు? అతివినయం నటిస్తూ— ప్రేమ ఒలకబోస్తూ మొదట్లో ఆకాశానికెత్తేస్తారు. ఈ ఆడపక్షులు కాస్త తబ్బిబ్బు పడగానే— అవసరాలు తీర్చుకొని నీ గతినీదే అంటూ కట్నాల పెద్దమ్మల్ని బుద్ధిగా ఒప్పేసుకుంటారు. ప్రేమమైకం తగ్గగానే తన జీవితం వో ప్రశ్నార్థకంగా కాగా— ఆ ఆడదానికి లోకం నీతిపాఠాలు వల్లెవేస్తుంది. 'ముల్లు అరిటాకు మీదపడ్డా— అరిటాకు ముల్లు మీద పడ్డా......' అంటూ. చివరకు చావును వరించటమో— లేక ఏ అనుమానపు జబ్బుగల మగవాడిచేతిలోనో పడి జీవచ్ఛవంలా బ్రతకటమో— ఇదేకథ! ఇదే ఇక్కడి ఆడదాని జీవితం!'

ఆవేశంగా మాట్లాడుతున్న జానకిని చూసి, నళిని నెమ్మదిగా నవ్వింది.

"నువ్వు కేవలం ఒకే దృక్పథంలోంచి చూస్తున్నావు—జానకీ. మగవాడికీ వున్నది కథ! మంచిగాని చెడుగాని— ప్రతిమనిషి జీవితంలో తప్పకుండా వుండి తీరుతాయి. ప్రకృతి దృష్ట్యా అయితేనేం— సంఘం అంటగట్టినదయితేనేం— ఆడది బలహీనురాలు అన్నారు. సుకుమారి అన్నారు. స్త్రీ కాలుజారితే ఆ ప్రభావం ఆమెమీద తీవ్రముగా వుంటూంది. అదొక్కటే లోపం. అదొక్కటే ఆమె జీవితం మీద పెద్ద అఘాతం సృష్టిస్తుంది. ఇప్పుడిప్పుడు స్త్రీ మేలుకొని జాగ్రత్త పడుతోంది. మగవాడికన్నా ఆడది ఎందులోనూ తక్కువగాదు అని నిరూపిస్తున్నారు. ముందు ముందు ఆడదానికి గొప్పప్రగతి కనిపిస్తోంది. నేననేది ఏమిటంటే ఒకరి ఆనందం—మరొకరి దుఃఖం కాకూడదని. మగవాళ్ళంతా కఠినులుకారు. ఆడవాళ్ళంతా అబలలు కారు. అటూ—ఇటూ వుంటారు. హృదయం అన్నది అందరికీ వుంటుంది!"

"చూడటానికి మూగదానిలా కూర్చుం•

everest/39u/ACW.Te

టావు—కానీ ఫర్వాలేదు. నువ్వూ ఆలోచిస్తావు" అన్నది జానకి నవ్వేసి.

'చెప్పానుగా!— ఆలోచించే శక్తి ప్రతి వాళ్ళకూ వుంటుంది. అయితే పంథాలు వేరు.'

జానకి మాట్లాడలేదు. ఏదో ఆలోచనలో పడింది. చల్లదనాన్ని పులుముకున్న సాయం సంధ్య మనోహరంగా వుంది. జాజి పందిరి నిండా పువ్వులు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. కమ్మని సువాసనను మోసుకొస్తోంది గాలి. మంచంమీద వెనక్కివాలి ఆకాశంలోకి చూసింది నళిని. విరిగిపోయిన పాలలా తమాషాగా వుంది ఆకాశం.

"ఇంతకీ తప్పంతా నా దంటావు?" అన్నది జానకి వున్నట్లుండి.

జానకివైపు తిరిగి నవ్వింది నళిని.

"తప్పొప్పుల ప్రసక్తే మొచ్చిందిప్పుడు? తెలిసీ ఒక మనసును గాయపరచ వద్దన్నాను. సారీ! ఆ ఇంక విషయం వదిలేద్దాం!"

"అలా వీల్లేదమ్మాయ్! నాచేత అంతా వాగించి— ఆ విషయం ఏదో వో కొలిక్కి రాకుండానే వదిలేస్తే ఎలా? 'మంగళవారం సాయంత్రం కలుద్దాం' అన్నాను. కలవాలా అక్కర్లేదా?"

"బాగుంది. అది నువ్వు ఆలోచించుకోవాలి. మీ స్నేహం పూల పరిమళంలా భాసించాలంటాను — చెడుపరిణామాలకు దారి తీయకుండా. నే చెప్పేది అదొక్కటే. ఒకరిపై ఒకరికి సదభిప్రాయం— గౌరవం వుండాలి. అదే లోపించింది నీలో. నీతో పదిసార్లు మాట్లాడ్తాడని— నీతో తన గోడు చెప్పుకుంటాడని—నువ్వంటే వెంపర్లాడే అతను నీకు లోకువ. నా కెందుకో అతనంటే సానుభూతి కలుగుతోంది జానకీ! చాలామంచి వాడిలా అనిపిస్తున్నాడు."

"నువ్వో పిచ్చి మొద్దువి! నీకు అంతా మంచిగానే కనిపిస్తుంది."

"ఈ విషయాలు మీ యింట్లోవాళ్ళకి తెలుసా?"

"ఇందులో ఏముందని తెలియటానికి?"

జానకి నిబ్బరానికి వింతగా చూసింది నళిని.

"ఇంక నేవొస్తాను నళినీ! పొద్దుపోతోంది

"వుండు! సన్నజాజులు కోసి ఇస్తాను." అంటూ లేచింది నళిని.

"చెట్టుకే వుండనిద్దూ.... అందంగా



వున్నాయి" అన్నది నవ్వి.

"రేపొద్దున రాలిపోయేవేగా!"

"పుష్పించివున్న కాసేపూ— పరిమళాన్ని వెదజల్లుతాయి. అది చాలదూ?"

"నిన్ను మాటలతో గెలవటం కష్టమే జానకీ!"

'మాట్లాడటం చేతగాదంటే సరిపోదూ'

"అబ్బ! సరేతల్లీ..... ఒప్పుకుంటున్నాను."

నవ్వుకున్నారిద్దరూ.

* * *

పచ్చగడ్డిమీద ఓరగా పడుకుని— నదిలోకి పుల్లబెడ్డలు విసరేస్తున్న మూర్తిని ఒక్కక్షణం ఆగి చూసింది జానకి. తనూ నెమ్మదిగా కూర్చుంటూ—

"ఏమిటంత దీర్ఘాలోచన?" అడిగింది.

ఉలిక్కిపడి వెనుదిరిగిచూసి— సరిగ్గా కూర్చున్నాడు. తలవంచి గడ్డిపరకలు పీకుతున్న మూర్తి ధోరణి ఆమెకు వింతగా తోచింది.

"ఏమిటి మూర్తీ— మౌన వ్రతం పట్టావు" అన్నది మళ్ళీ.

"జానకీ! నేనొకటి అడుగుతాను — సూటిగా చెప్పు! నన్ను గురించి నీవేమనుకుంటున్నావు?" అన్నాడు ఆమె కళ్ళల్లోకి చూస్తూ. అతని కళ్ళల్లో ఏదో పట్టుదల గోచరిస్తోంది.

"వున్నట్లుండి అలా అడుగుతున్నావేం?"

"జానకీ... నీకు పుణ్యముంటుంది— మాట తప్పించకు!"

"అయితే విను, నేనింకా ఏమీ అనుకోవటం లేదు."

"ప్లీజ్.... జానకీ...." దీనంగా వున్న అతని ముఖం ఆమెలో జాలికి బదులుగా కోపాన్ని రగిల్చింది.

"మిస్టర్ మూర్తీ! ఏమిటి నీ అభిప్రాయం"

వింతగా చూశాడు మూర్తి "అంటే?"

"అమాయకురాలైన ఆడపిల్లతో నాల్గు రోజులు స్నేహం చేసి — [illegible] నడకముందే — 'నా గురించి నీ ఉద్దేశమేమిటి?" అంటూ ఈ డొంక తిరుగుడు ప్రశ్నలేమిటి?' నిలదీస్తున్నట్లుగా అడిగింది.

గుడ్లప్పగించి ఆమెవంక చూస్తుండిపోయాడు.

"మంచిది మూర్తీ!— నాదే పొరబాటు. నువ్వు ఒక మగవాడివనీ— నీది ఒక మగ బుద్ధి అనీ— మరిచిపోయి నీతో కలిసి తిరిగాను. అయినా మించిపోయిందేమీ లేదు. ఇప్పటికయినా నీ బుద్ధి బైటపెట్టావ్. నిర్మలమైన మనస్సుతో చేసే స్నేహమే ఎక్కువ కాలం నిలబడుతుంది.' నీలా ఇలాంటి కుచ్చితమైన ఆలోచనలు కడుపులో పెట్టుకుని పైకి అమాయకత్వం నటించే మగాళ్ళంటే నాకు పరమ అసహ్యం! ఏం? ఆడదానితో మామూలు స్నేహం. పనికి రాదా? ప్రేమమైత్ర్యం వుంటేనే గాని అది శోభించదా?"

'చాలు జానకీ! ఇంకేం చెప్పవద్దు!' వణుకుతున్న స్వరంతో అస్పష్టంగా అన్నాడు.

అతని ముఖంలోకి చూసింది.

"అరె! అదేమిటి? ఎందుకలా తెల్ల ముఖం వేస్తావు? [illegible] అన్నానా? అమ్మనేనప్పుడే— ఆడపిల్ల కవిని కష్ట నిష్ఠూరాలను— భరించే శక్తి కూడా కలిగి వుండాలి. జీవితంలో [illegible] ఎంత ఎక్కువగా వుంటే అంత రాటుదేలుతాడు మనిషి. ఈ అనుభవంతో— నువ్వు మళ్ళీ ఇలాంటి పొరపాటు పనులు చేయకుండా వుండు!" అన్నది ఆజ్ఞాపిస్తున్నట్లే.

మూర్తి అంతరంగంలో అలజడి మొదలైంది. హృదయం మూలుగుతోంది.

"ఇది పొరపాటా జానకీ?.... జానకీ ఎందుకిలా నన్ను చిత్రవధ చేస్తావు? నేను నీకేం అన్యాయం చేశాను? ప్రేమే నేరమా? నేనేం నిన్ను మభ్యపెట్టలేదు. మోసగించలేదు. కళ్ళుగప్పి నా అవసరాలు తీర్చుకోవాలని— తాపత్రయ పడలేదు. నిష్కల్మషంగా మనసు విప్పి చెప్పి నీకు అంగీకారమైతేనే— నీవు మనస్ఫూర్తిగా ఇష్టపడితేనే నా జీవితాన్ని సాఫల్యం చేసుకోవాలనుకున్నాను. ఇది తప్పా? దీన్ని కుళ్ళు— కుచ్చితం అంటావా? జానకీ! ఎంత అపార్థం చేసుకున్నావు! ఎంత నిర్దయగా మాట్లాడుతున్నావు!! చాలు జానకీ—చాలు. ఈ అఘాతం చాలు నాకు!' పైకి అనాలనే విశ్వప్రయత్నం విఫలమయింది. [illegible] మాటలు మరింత బిగుసుకు పోయినయ్. నవనరాల్లోనూ—నిస్సత్తువ. కళ్ళముందు అలుపు

# అరిటాకు—ముల్లు

కారం: వున్నపాటుగా తనెక్కడికో అగాధానికి విసిరేసినట్లు ఒణుకు—ఇన్ని భావాల దుష్ట స్వాణువులా కూర్చుండిపోయాడు మూర్తి.

జానకి దూరంగా నదిలో ఒంటి కాలు తపస్సు చేస్తున్న— కొంగలవైపు చూస్తూ కూర్చుంది. చల్లనిగాలి ఆమె ముంగురులను ముఖం మీదకు తోస్తోంది. పాలరాతి నునుపుదనంతో మెరిసిపోతున్న ఆమె చెంపల మీద అందంగా నృత్యం చేస్తున్నాయి ముంగురులు. ఆమెవంకే చూస్తున్న మూర్తి మూగగా అనుకున్నాడు.

"జానకీ! నీ ఎదుట నేను మూగవాడినై పోతాను. చెప్పాలనుకున్నవన్నీ ఏ మూలకో పారిపోతాయి. నేను పిరికివాడిని. అందుకే నువ్విలా చులకన చేసి మాట్లాడుతున్నావు."

జానకి హఠాత్తుగా అతనివైపు తిరిగి "గుడ్‌బై మూర్తీ! నీకేకాదు— నీ స్నేహానికి కూడా. ఇక ముందైనా ఆడపిల్లల విషయంలో కేర్‌ఫుల్‌గా వుండు" అంటూ లేచి నిలబడింది.

మూగగా ఆమెవైపే చూస్తుండిపోయాడతను. జానకి వయ్యారంగా నడుము వూపుతూ వెళ్ళిపోతోంది. మూర్తి గుండె మండిపోతోంది. వళ్ళంతా మంచుబొట్లు పోసినయ్.

"జానకీ.... ఇది మన ఆఖరి కలయికా? ప్లీజ్ జానకీ! నువ్వెంత దులపరించుకున్నా నిన్ను సహించుకోలేని దుస్థితిలో వున్నాను నేను. నిన్ను ప్రేమించటమేగానీ— ద్వేషించలేని స్థితినాది. వెళ్ళిపో జానకీ..... వెళ్ళిపో! నీ ఆశలు ఊహాలు ఎంతో ఎత్తయినవి. అవి ఆకాశపు అంచున విహరించేవి. అవి నేనందుకోలేనివి. అవి పేకమేడల్లా కూలి పోకుండా వుండాలని కోరుకుంటున్నాను. నీ ఆశయాలు పండి— నువ్వు సుఖంగా వుండాలని కోరుకుంటున్నాను. నాది భగ్న ప్రేమ.. గుడ్డి ప్రేమ. నీపై అభిమానాన్ని పెంచుకుంటున్నప్పుడే నీ వుద్దేశాల్ని గ్రహించాల్సింది. నీ ఆలోచనల్ని అర్థం చేసుకోవాల్సింది. సంఘంలో ఒక విలువ వున్న వుద్యోగిస్తుడిని. కాస్తో కూస్తో పరపతి వుంది. అనాకారినికాదు. అన్నిటినీమించి కట్టుకున్న భార్యను సుఖపెట్టగల స్థోమతా వుంది, మనసు వుంది. ఈ అహమే నా కళ్ళకు పొరలు కప్పింది. నువ్వు తిరస్కరించవనే భరోసా నిచ్చింది. నీ పట్ల నా ప్రేమకు వూపిరి పోసింది. ఇప్పుడు నువ్వు కనువిప్పు కలిగించావు. అహంకారంతో ఏదీ అందుకోలేనని— కొట్టినట్లు చెప్పావు.'

అతని కనులముందు జానకి రూపం అదృశ్యమైంది. సమస్తమూ పోగొట్టుకుని సర్వశక్తులా వుడిగిపోయిన వాడిలా అలా చాలాసేపు కూర్చుండిపోయాడు మూర్తి.

* * *

"వెరీగుడ్ నళినీ! పెళ్ళికూతురివవుతున్నావన్నమాట!" నవ్వుతూ అంది జానకి

"కాకపోతే తప్పేట్లు లేదు!"

"అంటే?"

"అవును..... ఇంకా కొన్నాళ్ళపాటు స్వతంత్రంగానే వుందామనుకున్నాను. కానీ, అన్నయ్య, వదినల బలవంతంతో ఒప్పుకోవాల్సి వస్తోంది."

"అదేమిటే? మధ్యన వాళ్ళ బలవంతం దేనికి?"

"అతను చాలా నిదానస్తుడుట! మంచివాడట!— కాస్తో కూస్తో ఆస్తిపాస్తులున్నాయట!"

"నాన్సెన్స్! ఎంతసేపూ డబ్బూ... సంపాదన! ఇదేనా మనిషికి కావాల్సింది? ఇద్దరి మనసులు కలవాలి! ఒకరంటే ఒకరు పడి చావాలి. అప్పుడే ఆ జీవితం ఎంతో తియ్యగా వుంటుంది."

"నువ్వన్నది రైటే! కానీ ఆ పడి చావటం అన్నది ఎన్నో నాళ్ళు వుండదు. దరిద్రం— ఆకలి— కన్నీళ్ళు— ఒకరిపై మరొకరికుండే ప్రేమ— మమకారాల్ని సమూలంగా తినేస్తాయి. మరి ప్రేమ కూడు పెడ్తుందా? అన్నడిగితే కడుపు నిండా తిండివున్న వాళ్ళకే ప్రేమ అలంకారంగా వుంటుంది."

"న్యా... అయితే అతనికి ఎంత మొక్కుబడి ఇవ్వాలి?"

"ఇంకా అందాకా రాలేదుగా!" నవ్వింది నళిని.

"ఆ మాట అనటానికి నీకు సిగ్గు వేయటంలేదూ?"

"సిగ్గుపడినా చేసే దేముంది? నువ్వన్నట్లు ఆ మొక్కుబడి చెల్లిస్తేగానీ— మోక్షం లేదుగా!"

"ఏం— అంతమోక్షం లేకపోతే బ్రతకలేవా?"

"బ్రతకలేనని కాదు— రక్షణవుండదు!"

"ఎందుకుండదు? ఎంతమంది ఆడవాళ్ళు ఒంటరిగా జీవించటం లేదు?"

"నువ్వెన్నైనా చెప్పు జానకీ!— అది అనుభవంలో చాలా కష్టం! దానికెంతో గుండె ధైర్యం కావాలి. నీకున్న ఆత్మ విశ్వాసం— స్థైర్యం నాకు లేవు. అన్నయ్యనీ— వదిన్నీ 'నా పెళ్లి విషయం నాకొదిలేయండి!' అని గట్టిగా అడగలేకపోతున్నాను."

"ధైర్యే— సాహసే లక్ష్మీ' అన్నారు. ప్రయత్నం చేయి. నీ కాళ్లమీద నువ్వు నిలబడు. ఇప్పుడు మెతకతనంతో తల వంచి— చేసుకునే వాడికి లంచమిచ్చి . . . ఎందుకు? లక్షణంగా తనని పెళ్లిచేసుకుని— తన జీవితానికి ఆలంబనగా నిలచి — తన అవసరాల్ని తీర్చి— తన ఇంటికి ఓ కాపలా కుక్కలా పడి వుండటానికి! అబ్బ! ఈ కట్నాల మాట నా చెవిన బడిందంటే— వంటికి కారం రాచుకున్నట్లనిపిస్తుంది. తీసుకునే వాళ్ళను వరసగా నిలబెట్టి షూట్ చేద్దామన్నంత పిచ్చికోపం వస్తుంది. స్కూల్ ఫైనల్ పాసయితే చాలు! ఇంకా మగాడికి కట్నంతో పిల్ల నివ్వటానికి సిద్ధమవుతారు. కాబోయే భార్యను పోషించే స్తోమతుందా లేదా? అనే ఆలోచన వుండదు! ఇంతగుడ్డిగా ఎందుకు ప్రవర్తిస్తారో అర్థం కాదు."

"అర్థమైనా ప్రయోజనం లేదుజానకీ! అవివేకమూ— నిస్సహాయత— దారిద్ర్యమూ— సంఘభీతి— వీటి వలయంలో పడి— మనిషి పిచ్చివాడిలా మారిపోతున్నాడు. ఎక్కడికక్కడ తన బాధ్యతల్ని వదుల్చుకోవాలన్న తపనలో— దానివల్ల కలిగే ఫలితాలను అంచనా వేసే పరిస్థితిని దాటిపోతున్నాడు. ఇప్పటికి ఈ సంఘం — ఈ ఆచారాలు— అలవాట్లు మారాలంటే మరో వీరేశలింగమో— మరో మహాత్ముడో . . . ."

"పుట్టాలంటావు? నువ్వూ— నేనూ మనలాంటి వాళ్ళూ— ఆ పుట్టబోయే మహాత్ములకోసం చేతులు ముడుచుకుని

ఎదురు చూడాలంటావు? అంతేనా? మనలాంటి ఆడవాళ్ల జీవితాలు నాశనమై పోతున్నా— మనం చేయగలిగేదేమీ లేదన్నమాట? ఆ మహాత్ముడెవరో పుట్టి పెరిగి— సంఘాన్నుద్ధరించేస్థితికి వచ్చేసరికి మనం ఎన్నిసార్లు పుట్టి— గిట్టాలో. ఎందుకీ వూక దంపుడుమాటలు నళినీ? చేవవుంటే మన జీవితాల్ని మనమే సరిదిద్దుకోవాలి!— లేదా అన్నిటికీ తలవంచి, మన జీవితాల్ని— భవిష్యత్‌నూ— చుట్టూవున్న వాళ్లకు వప్పజెప్పి— ఫలితంకోసం ఎదురు చూడకుండా— బ్రతకటం నేర్చుకోవాలి. ఎవరో వచ్చి ఏదో చేస్తారట— నిరీక్షించటంలో ఎంతో సోమరితనం వుంది.''

''నువ్వు వట్టి ఆవేశపు ముద్దవు జానకీ! నువ్వూ—నేనూ తెగించినంత మాత్రాన తెగిపోయే సమస్యకాదిది!''

''నేనూ నువ్వేకాదు. ప్రతిఆడపిల్లా తనకుతాను సొంతంగా ఆలోచించుకోవాలి. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించు కోవాలి. చక్కని సమయస్ఫూర్తితో తన జీవితాన్ని తానే చక్కదిద్దుకోవాలి. అప్పుడే ఈ దురాచారాలన్నీ సమసిపోతాయి. ఆడవాళ్ల జీవితాలు వెలుగులోకి వస్తాయి.''

''నువ్వు చెప్పేటంత తేలికకాదు ఈ సమస్య. అందరికీ ఒక్కలాంటి మనస్తత్వమే వుండదు కదా!''

''నువ్వీ పిరికి పాఠాలు మానేసెయి నళినీ! ఎప్పుడూ ఏవేవో భయాలు చుట్టూ అల్లుకుని ఎందుకలా బెదిరిపోయి మాట్లాడతావు? నువ్వు నీకోసం బ్రతకాలి నళినీ!'' తీవ్రంగా అన్నది జానకి.

నళిని నవ్వింది.

''అబ్బ! ఇంక ఆ టాపిక్ వదిలేద్దాం! కోపాన్ని కూడా వదలగొడ్దూ!'' అంటూ,

జానకీ నవ్వుతూ— ''నీకు బుర్ర వుందిగానీ— ఆలోచించటానికి బద్ధకం! కానీ ఆలోచనలే మెదడుకు పదును పెడతాయి— తెలుసా?'' అన్నది.

''ఔనౌను! వెర్రి మొర్రి ఆలోచనలు ఎక్కువగా చేస్తే పిచ్చి ఎక్కుతుందనీ తెలుసు!''

ముక్కు పట్టుకుని వూపుతూ— ''కొంటెపిల్లా!— ఎదటివాళ్లని బోల్తా కొట్టించటం నేర్చావు!'' అంటూ గలగల నవ్వింది జానకి.

''అమ్మయ్య! ఇప్పుడు మామూలు మూడ్‌లోకి వచ్చావు! ఊఁ . . . ఇంతకీ నీ ప్రేమికుడు ఏమంటున్నాడు?''

''విషాదగీతాలు పాడుకొంటూ— భగ్నజీవి అయిపోయి— దేవదాసు ఫోజులన్నా వేస్తూ వుండాలి!— లేదా పెళ్లికొడుకై— పీటల మీద కూర్చునేందుకు సిద్ధమవుతూ అన్నా వుండాలి! శలవుపెట్టి— ఎటో వెళ్లాడు. కనిపించటం లేదు.''

''మరి నువ్వేం చేయదల్చుకున్నావు?''

''రెండు పూట్లా భోంచేయ దల్చుకున్నాను.''

''అదికాదు . . .''

''ఏదికాదు?— ఏమిటీ పిచ్చి ప్రశ్న? ఏం చేస్తాను?''

''అబ్బ! నువ్వలా కోపంగా మాట్లాడతే . . . .''

''కోపం కాదు నళినీ . . . బాధ! నువ్విలా పసిపిల్లలా ప్రవర్తిస్తుంటే బాధగానే వుంది!''

తెల్లబోయింది నళిని. — ''నేనేం చేశాను?'' అంటూ.

''కాకపోతే ఏమిటి? మూర్తి తప్ప నా కింక ప్రపంచమే లేదా? భవిష్యత్తే లేదా? జీవితమే లేదా?''

''వుంది కనుకనే ఏం చేస్తావంటున్నాను?''

''ఏం చెయ్యాలో ఇంకా నిర్ణయించుకోలేదు.''

నళిని మాట్లాడలేదు. జానకి ఆమెనచూసి నవ్వుతూ — భుజంమీద చెయ్యివేసి— 'కోపం వచ్చిందా నళినీ?' అన్నదిమెల్లిగా.

ఆశ్చర్యంగా చూసి —'కోపంఎందుకు? అన్నది.


'క్షమించు నళినీ! నాది కొంచెంతీవ్రస్వభావం! కూడదనుకుంటూనే ఆవేశానికి లోనౌతాను.'

'నీమాటలు—నీమనస్తత్వం నాకుతెలుసు. నీమాటలు నాలో ఆలోచనల్ని రేపుతాయి. అందుకే మధ్యలో మౌనంగా వుండిపోతాను.'

నళినివైపు అభిమానంగా చూస్తూ నిట్టూర్చింది జానకి.

* * *

పదిరోజుల తర్వాత నళిని— జానకిఇంటికొచ్చింది. ఆరు బయట వేపచెట్టు క్రింద



# అరిటాకు–ముల్లు

మంచంమీద చేతుల్లో గడ్డం వుంచుకుని కూర్చున్న జానకిని చూస్తూ—

'హలో–జానకీ!' అంటూ పలకరించింది.

తపోభంగమైన మౌనిలా ఉలిక్కిపడి చూసింది జానకి.

'నువ్వా? రా...రా .. ఇలా కూర్చో. ఏమిటిలా దారితప్పి వచ్చావు?' అన్నది నవ్వు తెచ్చుకుంటూ.

జానకి ప్రక్కన మంచంమీదకూర్చుంటూ 'అబ్బ!ఇక్కడ ఎంతహాయిగావుంది జానకీ! అందులోనూ మీ ఇంటిముందున్న ఈవేప చెట్టు చల్లని గాలితో సేద తీరుస్తుంది.' అన్నది — ఆమెకళ్లల్లోకిచూస్తూ.

'ఏదైనా మనం అనుకోవటంలో వుంది. మనసులో ప్రశాంతంగావుండి—ఉత్సాహం వురకలు వేస్తున్నప్పుడు—ప్రపంచమంతా సుందరంగా—నూతనోత్తేజంతో మెరిసి పోతున్నట్టూ— ఈ సృష్టంతా మనకోసమే జరుగుతున్నట్టు అనిపిస్తుంది. అదే దెబ్బ తిన్న మనసైతే— తనమీద రోత—ప్రపంచంమీద కసి— ప్రకృతిలోని ప్రత్యణువులో ఏదో నీరవత గోచరిస్తుంది. తను కష్టజీవి అనీ—మిగతా అంతా అదృష్టవంతులనీ—ఇంకా అనేక రకాలయిన భావాలు. ఇంతకీనేను చెప్పేదేమంటే—మన మనసులోని భావాలే—కళ్లకలాగ కనిపిస్తాయి' అన్నది ఆలోచనగా.

నళిని మౌనంగా —జానకివంకచూసింది.

లేతగులాబీరంగు చీర—నల్లజాకెట్టు—పొలుజడ—జడలో తెల్లగులాబీ ... అదీచెవికి పక్కగా. ఆపోజులో జానకి మూర్తీవంతంగా ఆర్టిస్టు శ్రద్ధతో గీసిన బొమ్మలా—కనుల నాకట్టుకుంటోంది. 'ఇంత చక్కని జానకిలో—ఎంత విపరీతమైన భావాలో...' అనుకుంది నళిని.

'వారంరోజుల్నించీ—ఆఫీసుకెళ్లటం లేదా నువ్వు?' అడిగింది.

'అవును! ఏం అలా అడిగావు?'

'మరేంలేదు. రోజూ ఆఫీసుకెళ్తూనో కనిపించేదానివికదా! వంట్లో బాగాలేదేమో చూసిపోదామని వచ్చాను.'

'వంట్లోకాదు.ఇంట్లోనే అశాంతిగావుంది' కలవరపాటును అణచుకుంటూ అంది.

'అదేమిటి?' ఆశ్చర్యంగా చూసిందినళిని.

'నేను ఉద్యోగం చేయకూడదట!—మౌనేసి బుద్ధిగా ఇంట్లో కూర్చుని—పెద్దవాళ్లన్నదానికల్లా గంగిరెద్దులా—తలూపుతూ వ్యక్తిత్వానికి తిలోదకాలివ్వాలిట! అంటే..,జీవచ్ఛవాన్ని కావాలన్నమాట!' అన్నది నెమ్మదిగా.

'జానకీ.. ఏమిటిది? నిజంగానా?'

'అరె! ఎందుకలా ఆశ్చర్య పడతావు? ఇలాంటి ముసలం మావాళ్లలో పుడుతుందని నాకెప్పుడో తెలుసు. అయితే—అందరూ నాపై కత్తిగడ్తారనుకోలేదు.'

'ఏం చేయమంటారు ?'

'మగ అనబడే పదార్థానికి దూరంగా వుండమంటారు. దాని తాత్పర్యం—ఉద్యోగం రాజీనామా చెయ్యమనటం అన్నమాట!'

'నువ్వేం చేశావని?'

'పిచ్చినళినీ! ఆమాత్రం వూహించలేవూ? మూర్తితో స్నేహం అందరికీ తెలుసు. అదేదో—ప్రణయవ్యవహారమని మావాళ్ల నమ్మకం. నిజంగానే ప్రేమలోపడితే—వీళ్ల నెప్పుడూ లక్ష్యపెట్టననుకో. ఇంకపోతే నాదృష్టిలో ఆడవాళ్లెంత స్నేహపాత్రులో—మగవాళ్లైనా అంతే. అందుకే నాసహోద్యోగులతో చనువుగా వుంటాను. కానీ రంగుటద్దాలతో చూసే ఈ పెద్దవాళ్లకు అలా ఎలా తోస్తుంది? నేనేదో చెడిపోతున్నానని నాకంటే ఎక్కువగా బాధపడి—రగడచేస్తూ నన్నుద్ధరించి—బాగుచెయ్యాలని చూస్తున్నారు. ఐడోంట్ కేర్! కాకపోతే ఇక్కడి నుంచి ఎంతత్వరగా ట్రాన్స్ఫర్ వస్తుందా అని ఎదురు చూస్తున్నాను. త్వరలోనే వస్తుంది.'

'నేనొక్కమాట అడగనా జానకీ?'

'నువ్వడిగేది నాకు తెలుసు. ఇంతమందిని ధిక్కరించి—నీవు సాధించేది ఏమిటి? అని. అంతేనా?' నవ్వింది.

'అవును.'

'అయితే...నాజవాబు విను. నాకు ఇరవై ఏళ్లు దాటినయి. చదువుకున్నాను. ఉద్యోగ ప్రపంచంలో అడుగెట్టి—లోకాన్నీ—మనషుల స్వభావాల్నీ స్టడీ చేస్తున్నాను. నాకు మంచీ—చెడు— విమర్శనా దృష్టితో—పరిశీలించే తెలివి వున్నది. నాజీవితాన్ని నాచేతులతో—నాభావాలతో— నానమ్మకాలతో—నా ఆశయాలతోనే మలుచుకోవాలనేది ఆదర్శం. ఇతరులకి తలవొగ్గి—కీలుబొమ్మలా నర్తించే అవసరం నాకు రానేరాకూడదు. వస్తే—ఆజీవితానికంటే చావే నయం! అనేది నాదృఢ నిర్ణయం. నాకేది మంచనితోస్తే—అదేనాకు వెలుగు— ఆదర్శం—ఆనందం,..అనుసరణీయం!' ఆవేశంతో అన్నది జానకి. ఆమెకంఠంలో స్థిరత్వం—ముఖంలోపట్టుదల—కళ్లల్లో నిశ్చయం కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి.

'అలాగని ఆడది ఒంటరిగా..ఈసంఘంలో' ఏదో చెప్పబోయింది నళిని.

'ష్! ఇంకనీ పిరికి కబుర్లు కట్టిపెట్టు! ఆడది తల్చుకుంటే—సాధించలేనిదేదీ లేదని చెప్పు!' సంతోషిస్తాను.

నిట్టూర్చింది నళిని.

'అయితే నువ్వు దూరంగా వెళ్లిపోతున్నావన్నమాట. !'

'అవును !..దూరంగా... ఈ విశాల ప్రపంచంలోకి. నళినీ..నాకప్పుడప్పుడు అనిపిస్తూంటుంది. పక్షినై పుట్టకూడదా అని. హాయిగా ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతూ ఏ దూర తీరాలకో.... అబ్బ! ఆజీవితం ఎంత తియ్యగా వుంటుందీ......'

'అవన్నీ మన వూహాలు అంతే! దానికితగ్గ సమస్యలు—దానికీ వుంటాయి.'

'నళినీ..నువ్వు వూహించుకోటంలోనున్న మాధుర్యాన్ననుభవించ లేవు.'

'నిజమే. నాకెందుకో ప్రతిదాన్లోనూ—లోటుపాట్లు వుంటాయనిపిస్తుంది' ఒప్పుకుంది నళిని.

వరండాలో కొచ్చి నిలబడిన పదేళ్ల తమ్ముడిని చూస్తూనే—కేకేసింది జానకి 'గోపీ. ఇలారా!' అంటూ వచ్చాడు గోపీ.

'నళినక్కకు కాఫీ పట్టుకురా!' అన్నది.

'ఒద్దు.. ఇంతకుముందే తాగేసి వచ్చాను జానకీ!' అన్నది వారిస్తూ.

'ఫర్వాలేదు...ఇది అతిథిమర్యాదకదుటోయ్ కాదనకూడదు!'

'ఏమర్యాదా వద్దు! రామాయణంలోపిడకల వేటలాగా—మధ్యన ఈ గొడవ ఎందుకు?'

'ఎందుకా? నాతో మాట్లాడాలంటే—అంటే వాదించాలంటే—అర్థశేరు అన్నం తిని—ఆరుసార్లు కాఫీ త్రాగుతూ సతమతమై పోవాలిట! మా అమ్మఅంటుంది!' నవ్వింది గలగలా.

జానకివైపే మంత్రముగ్ధలా—చూసింది నళిని. ఎంతో బరువుతో—కుంగదీసే సమస్యల్లో చిక్కుకుని వున్నా—జానకి స్వచ్ఛంగా నవ్వగలదు! అది ఆమె ప్రత్యేకత! అంతేకాక ఆనవ్వులో వుడికేఅందం ఆకర్షణ చూసేవాళ్లను పిచ్చివాళ్లను చేస్తుంది.

గోపీ తెచ్చిన కాఫీ త్రాగుతూ—పాలోచ

వగా అన్నది నళిని.

'ఇన్నాళ్ళూ నీతో గడిపినకాలం ఈజన్మలో మరిచి పోలేను జానకీ!'

అంటే... వచ్చే జన్మలో మర్చిపోతావా? పునర్జన్మమీద నీకు నమ్మకమున్నదన్నమాట'

'నాది హైందవ రక్తంకదా!' నవ్వింది.

'ఏరక్తమైనా—అసలు జన్మంటూవుంటే మళ్ళీ ఈ ఆడజన్మే కావాలి నాకు!'

'ఎందుకలా కోరుకుంటున్నావు?'

అవును! సృష్టిలో స్త్రీకంటే—సుందరమైనదీ—విలువైనదీ— ఆకర్షవంతమైనదీ మరొకటిలేదు. కాకపోతే కొందరిస్వార్థపరుల వల్ల ఆడవాళ్ళ జీవితాలు నరకకూపాలయి పోతున్నాయి. అదొక్కటే వ్యథతప్ప ఆడదానికి సాటి ఏమున్నది? సాధించలేనిదేమున్నది?''

'నిజమే. ఒకశ్రేయంతో నిండబడలేగాని జయించలేనిదేది లేదు — ఈ ప్రపంచంలో భయంకరమైన మృత్యువు తప్ప!'

'నాదృష్టిలో మృత్యువేమంత భయంకరం కాదు. కొన్ని కొన్ని—విషాదకరమైన — బీకరమైన అనుభవాలకంటే మృత్యువెంతో మేలనిది!'

ఖాళీగ్లాసు క్రింద పెడుతూ—నవ్వింది నళిని.

'మనంఎక్కడ మొదలుపెట్టి ఎక్కడకు వచ్చాం!' అంటూ.

'సరైన దోవలోనే వున్నాంలే! దేనికైనా ముగింపు మృత్యువేగా!' అన్నది జానకి.

కొంచెంసేపు ఊరుకుని—'నాకు లెటర్స్ వ్రాస్తూవుంటావుగా!' అన్నది నళిని.

'ఎందుకు వ్రాయను? అయినా ఇంకా ట్రాన్స్‌ఫర్ రాలేదుగదా!' అని కొంచెం సేపు ఏదో ఆలోచించి— 'నీకంటే నాకు ఆప్తులెవరున్నారు నళినీ? నామనసువిప్పి నీ ఒక్కదానికే చెప్పుకోగలుగుతాను. నా ఆశయాల్ని—ఉద్దేశాల్ని—శ్రద్ధగా వింటావు—బోర్ కొడుతున్నా. అందుకే నువ్వంటే నాకిష్టం! ఏమనిషికైనా—మనసు విప్పి చెప్పుకునే స్నేహితులే కరువైతే పిచ్చి ఎక్కిపోతుంది తెలుసా?' అన్నది.

జానకి కళ్ళల్లోకి ఆత్మీయతతో చూసింది నళిని.

(ముగింపు పైవారం)

# సంసారులకూ—సన్యాసులకూ



## బులుసు వెంకటరమణయ్య—ధర్మపథం.

సంసారులకూ సన్యాసులకూ ధ్యేయం మోక్షమనేది ఒక్కటే. దాన్ని పొందడానికి మునులు ప్రశాంత చిత్తతకోసం సర్వవిధాలా పాటుపడి కృతార్థులవుతారు. గృహస్థులు శాంతికోసం ప్రయత్నిస్తారు కాని కృతార్థతను పొందడం దుర్లభమవుతుంది. ఎంత ప్రయత్నించినా వారి మనస్సు లౌకికాలవైపు పరుగెత్తడం మానదు.

సన్యాసులు అనుసరించిన పద్ధతులనే అనుసరించినా—విఫల మనోరథుడైన ఒక సంసారి యీ విధంగా పరితపిస్తున్నాడు—

'మునులు సర్వసములు కావడంవల్ల మానావమానాలను లెక్కచెయ్యకుండా ఓరిమి వహించి ఉంటారు. నేనూ మానావమానాలను సహిస్తాను. ఓరిమివల్ల కాదు—శక్తి లేనందువల్లనే.

వారు సాంసారిక సుఖాలను ఏంతో సంతోషంగా విడిచి పెడతారు. నేనో 'అయ్యో! వీటిని విడిచిపెట్ట వలసి వస్తున్నదే!' అనే దుఃఖంతో విడిచి పెట్టాను

వారు తపోనియమాన్ని అనుసరించి ఎండను, చలిని, గాలిని సహించి ఘోర తపస్సుచేసి కృతార్థులౌతున్నారు. నేను ఎంతో శ్రమపడి వాటిని సహిస్తున్నాకాని వారివలె తపస్సు చెయ్యలేక పోయాను.

సన్యాసులు ప్రాణాయామం చేస్తూ రాత్రింబగళ్ళు 'శివ శివ' అంటూ భగవంతుణ్ణి ధ్యానంచేస్తారు. నేను రాత్రింబగళ్ళు తిరిగి తిరిగి ధనాన్ని గురించే ధ్యానం చేస్తున్నాను; శివుని నామాన్ని ధ్యానించలేక పోతున్నాను.

మునులు చేసే పనులే నేనూ చేసినా వారు తమ లక్ష్యాన్ని సాధించగలుగుతున్నారు కాని, నేను మాత్రం తప్పు దారుల్లో పడడంవల్ల నా కోరిక నెరవేరడం లేదు.'

ఈ అభిప్రాయాన్నే యీ శ్లోకం తెలియజేస్తున్నది—

'క్షాంతం న క్షమయా గృహోచిత
సుఖం
త్యక్తం న సంతోషతః
సోఢో దుస్సహ శీత వాతతపన
క్లేశో న తప్తం తపః
ధ్యాతం విత్త మహర్నిశం నియమిత
ప్రాణైర్న శంభోః పదం
తత్తత్కర్మ కృతం యదేవ
మునిభిః
తైస్తైః ఫలైర్వంచితాః'. ●

# పెద్దకథ:

(గత సంచిక తరువాయి)



నాలుగేళ్ళు గడిచినయి. ఈనాలుగేళ్ల కాలం చాలా మార్పుల్ని తెచ్చింది. జానకి విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్లై వెళ్లింది. నళిని పెళ్ళైంది. భర్తతో విజయవాడలో కాపురం చేస్తోంది. ఇద్దరిమధ్యా ఉత్తరాలు ఆత్మీయతను వెళ్లబోస్తూ జరుగుతున్నాన్నాయి.

ఆరోజు సాయంత్రం పేపరు చూస్తూ కూర్చుని వున్న భర్తనుద్దేశించి అన్నది నళిని.

'జానకి వస్తుందట!'

'జానకా?'

'అవునండీ! నాప్రాణం అని చెప్పలేదూ? ఆవిడ! రేపు ఉదయం రైల్లో వస్తున్నానంటూ ఉత్తరం రాసింది.'

'ఉహూ!'

'ఉహూ కాదు— కాస్త రేపు శలవు పెట్టండి!'

'శలవా? ఇంకా నయం! రేపు తెల్లవారు జామునే గుడివాడ క్యాంప్‌వెళ్ళాలి. రాత్రికే అన్నీ సర్ది వుంచు!'

'నిజంగానా?'

'నిజమే! అయినా మీ ప్రాణస్నేహితులిద్దరూ చాలా కాలం తర్వాత కలుసుకుంటున్నారు. మధ్యన నేనెందుకు? హాయిగా కాలాన్ని గడిపేయండి!'

'అది కాదండీ...మరి మిమ్మల్ని పరిచయం చేయొద్దా?'

'నళిని మొగుడిగానా?' నవ్వాడతను.

'మీకు వేళాకోళంగా వుందన్నమాట!'

'కాదు నళినీ! కాస్త ఆలోచించు. నీ మొగుడిగా పరిచయం చేయబడటానికి నేనాగిపోతే—అక్కడ నా మొగుడూరుకోడు. అసలే ఆయన ఖచ్చితమైనవాడు!'

'హుఁ!' అంటూ నిట్టూర్చింది నళిని. ఆమెను చూసి నవ్వుతూ అన్నాడు.

'అలా కాదు! ఇప్పుడు నువ్వు అనాల్సిన మాట—అయ్యోరామ!రాతకొద్దీ మొగుడూను గీతకొద్దీ బిడ్డలూనూ! అంటూ సాగతియ్యాలి.'

గలగలా నవ్వింది నళిని.

* * *

'ఎలావుంది మా ఇల్లు?' ఇడ్లీ ప్లేటు ముందు పెడ్తూ—తనూ పీట వాల్చుకుని

కూర్చుంటూ అడిగింది నళిని.

'ఇట్లా—ఇట్లాగే బేషుగ్గా వున్నారు. ఇక పోతే ఇంటాయనే.....'

'అనుకోకుండా ఆయనకు క్యాంప్ తగి లింది. లేకుంటే చూసేవుండే దానివి!'

'ఈ ఇల్లీ నువ్వేనా చేసింది?'

'అవును ! ఏం. ? బాగుండలేదా?'

'ఫస్టుగా వున్నాయి! ఏదీ ఇంకో పాయిం ట్‌ రానీయ్! ఊఁ పక్కా గృహిణిగా తయా రయ్యావ్! వంటకాలు అద్భుతంగా చేయటం నేర్చుకున్నావ్! ఇంకా ఏమిటి కబుర్లు?'

'వచ్చినప్పటినుంచీ..నేనే తెగవాగేస్తున్నాను ఇంక నువ్వు చెప్పు విశేషాలు. అమ్మా వాళ్లు బాగున్నారా?'

'వుండేవుంటారు. వుండకపోతే కబురం దేదేగా!'

'నీకెందుకింత పట్టుదల జానకీ! నువ్వు కోరుకున్నట్లు వాళ్లకు దూరంగానే వెళ్లి పోయావు గదా! ఎప్పుడైనా వెళ్లిచూడా లనైనా అనిపించదా?'

'అనిపించదు! నన్ను ద్వేషించేవాళ్లను చూడా లనిపించదు!'

'అంత అన్యాయంగా మాట్లాడకు! నీది గట్టిమనసు. కానీ మీ అమ్మసంగతి ఆలోచించు. నిన్నెంత తీవ్రంగా మందలించి విసరికొట్టినా—ఆవిడది మాతృహృదయం! నీకోసం తపిస్తూనే వుంటుంది.'

'ఇలాంటి సెంటిమెంట్ అంటే నాకు తల నెప్పి. కూతురిమీదే నమ్మకం లేక—సాపాటుర్పాషలాడి శాసించే తల్లి ఒక తల్లేనా? మాతృహృదయం అని అనగానే సరిపోతుందా? క్షమాగుణం అర్థం చేసుకునే మనస్సు—ఆశీర్వదించి చేయూతనిచ్చే గొప్ప హృదయం లేక పోయినతర్వాత! మాతృ లేదు—హృదయం లేదు!'

'అప్పటికీ—ఇప్పటికీ నువ్వేం మారలేదు జానకీ!

'ఎందుకు మారటం? ఈ జీవితం ఇలా సాగిపోవలసిందే.'

'నన్నడిగితే మార్పు వుండాలి. ఎప్పుడూ ఒకేరకమైన జీవితం విసుగెత్తుతుంది. ఏదో ఒకమార్పు! ..... అది మరపురాని దైతే మరీ తియ్యగా వుంటుంది.'

'నవ్వింది జానకి.తీపి ఎక్కువైనా కష్టమే. అయినా మాట వచ్చింది గనుక చెప్పు తున్నాను. ఆ తియ్యదనం నాబతుకులోనూ తొంగి చూసింది!'

'ఏమిటీ?' ఆశ్చర్యంగా చూసి 'నిజం గానా? చెప్పు జానకీ చెప్పు! ఎవరా అదృష్టవంతుడు? సంతోషంతో భుజాలు పట్టి వూపివేసింది.'

'అబ్బ నీకొకటే తొందర! ఏదీ ముందు కాఫీ ఇవ్వు!' ఖాళీప్లేట్లో చేతులు కడు క్కుంటూ అన్నది.

'సారీ..ఇదిగో ఒక్కక్షణం!' గిన్నెలోని కాఫీ కప్పుల్లోపోసి—జానక్కి అందించి—తనూ త్రాగుతూ చెప్పమన్నట్లు చూసింది. నళిని మనసులో —సంభ్రమం— అవర్ణ నీయమైన ఆనందం— అనేకరకమైన భావాలు సందడి చేస్తున్నాయి. జానకీ.... జానకినే ఆకర్షించగలవాడు ఎంతగొప్ప వాడై వుండాలి! ఎంత ఉన్నతమైన సంస్కారం గలవాడై వుండాలి!'

జానకి ఏదో ఆలోచిస్తోంది.

'చెప్పు జానకీ! ఎవరా అదృష్ట జాత కుడు?' అడిగింది కుతూహలంతో.

'అతడు అదృష్టవంతుడే కావచ్చు! కానీ ఆ అదృష్టం నాజీవితంలో ఎలా ఫలిస్తుందో చూడాలి. నేను పని చేసే ఆఫీసులోనే అతనూ పని చేస్తున్నాడు. మనిషిమంచి రూపసికాడు! అతను మాట్లాడుతుంటే మాత్రం మంత్రముగ్ధులమై పోతాము. అలా వింటూ ఎంతకాలమైనా గడిపేయా లనిపిస్తుంది. నన్ను చూడగానే ఎంతో మర్యాదగా విష్ చేస్తాడు. సభ్యత సంస్కారం ఉట్టిపడేలా ప్రవర్తిస్తాడు. ప్రతివిష యాన్నీ ఎంతో పరిశీలనా దృష్టితో చూసి అర్థంచేసుకుంటాడు. 'నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను!' అన్నాడు. నేను నిన్ను ప్రేమించటం లేదు! అని అనాలనిపించ లేదునాకు. అంటే నామనసుతో అతనంటే ఇష్టం ఏర్పడిందన్నమాట! అతన్నెందుకు కాదనటం? అనిపించింది పైగా. ఇదిప్రేమ అనను. భయంకరమైన ఎడారిలో వంట రిగా ప్రయాణించే పాంథునికి — తన తోడుగా మరొకరు కనిపిస్తే—ఎలాంటి సంతోషకరమైన అనుభూతికి లోనౌతాడో అలాంటి అనుభూతి రగిలింది నాలో.'

కాఫీ అలాగే చేతిలోవుంచుకుని ఎటో చూస్తూ— చెప్పుకుపోతున్న జానకిని వింతగా చూస్తూ— ఆసక్తిగా వింటోంది నళిని.

'నువ్విలా ఇంకొక వ్యక్తిని ఆకాశాని కెత్తే శావంటే—తప్పకుండా అతను చెప్పుకోదగిన వాడై వుండాలి. హమ్మయ్య! ఇప్పటికి జానకి పెళ్లికూతురవుతోందన్నమాట!' సంతోషం పైకి తన్నుకొస్తోంది నళినికి.

'బహుశః రిజిస్టర్ మేరేజిచేసుకుంటాం! ఇద్దరికీ అభిప్రాయ భేదాలు వుండ వనే నమ్మకం వుంటేనే... అంతదూరం వెళ్లేది.' అన్నది స్థిరంగా.

ఇద్దరూ డ్రాయింగ్ రూంలో కొచ్చారు. టేబిల్ సొరుగులోంచి ఆల్బమ్ తీసి జానకిముందు పడేసింది నళిని. కుర్చీలో కూర్చుని ఆసక్తిగా ఒక్కొక్క ఫోటో చూస్తోంది జానకి. నళిని పెళ్లి ఫోటోలు చూస్తున్న జానకి పెదవులమీద చిరు నవ్వు మెరిసింది.

'బాగున్నాయ్ నళినీ! ముఖ్యంగా నువ్వు చాలా నీట్‌గా పడ్డావు. ఇంతకీ మీ ఆయనపేరేమిటన్నావ్?'

'వాసుదేవమూర్తి!'

'గుడ్..: అలా చెప్పాలి అడగ్గానే. అడగ కూడనిదేదో అడిగినట్లు—సిగ్గుతో మెలి కలు తిరిగి పోకుండా. అసలు నాకప్పు డప్పుడూ అనిపిస్తుంది. మనకుతెలిసిన వారిలో—తెలియనివారిలో— అనేకమైన పేర్లు

తెనుగుబిడ్డ—

తెలుసుకో !

కులము పేరుమీద కొట్లాట సంఘాలు
గ్రామగ్రామ మందు కలవు నేడు
జనత కేమికద్దె జాతీయ భావంబు?
తెలుసుకొనర నిజము తెనుగు బిడ్డ!

తీయనైన తేట తెనుగులో వ్రాసిన
పాటకేల యితర భాష బాణి
అనుకరింపకున్న ఆంధ్రత్వమబ్బదా?
తెలుసుకొనర నిజము తెనుగుబిడ్డ!

శివుని యాజ్ఞ లేక చీమకుట్టదటంద్రు
హత్యలేల జరుగు నక్కజముగ
శివుడె చేయుమన్న శిక్షించు శుమలేరి?
తెలిసి కొనర నిజము తెనుగుబిడ్డ!

—కె. కె. శాస్త్రి.

# అరిటాకు–ముల్లు

ఉచ్చరిస్తాముకదా! ఏంతో సన్నిహితమైన ప్రియమైన— ఆత్మీయుని పేరు పలకటానికెందుకంత సంకోచం?'

'అదొక మధురమైన అనుభూతి! ఎక్కువ సార్లు అంటే దానిలోని మాధుర్యం పోతుందనేమో!'

'నాకలా అనిపించదు! అప్పుడలాసిగ్గుని అభినయించటం—తప్పని సరి అన్నట్లుగా, చాలామంది ఆడవాళ్లు సిగ్గుపడుతూంటారు'

'నాకలాంటి సిగ్గులేం లేవులే!' అంటూ నవ్వింది నళిని.

'మూర్తి గుర్తున్నాడా నీకు?'

'ఎందుకులేడు— నీ ప్రేమికుడుకదూ!'

'అతను పెళ్లి చేసుకుని ఇద్దరుపిల్లల్ని కూడా కన్నాడు! అప్పట్లో అతనికి నీవు పిచ్చి ఎత్తుతుందనే దానివి!'

గాఢంగా ప్రేమించినవాళ్లకు తిరస్కారం పెద్ద దెబ్బ తీస్తుంది. అందుకే అలా అన్నాను. నిష్కంతగా ఆరాధించి పెళ్లి ఎలా చేసుకున్నాడో......'

'అతను చేసిన పని నాకు చాలా నచ్చింది. తనసుఖం తాను పొందాడు. అలా కాక జీవితాంతం ఏడుస్తూ—ఇవతలవాళ్ల జీవానబడి—పెద్ద గుదిబండలా వుండటంలో గొప్ప తనం వుందా?'

'అయితే ఇంక ప్రేమకు అర్థమేమిటి?'

'నిజాయితీ అయిన ప్రేమకు అర్థం తను హృదయపూర్వకంగా ప్రేమించిన మనిషి సుఖం శ్రేయస్సుని నిస్వార్థంగా కోరుకోవటమే.'

'అయితే మూర్తి నిజాయితీపరుడేనేమో నీసుఖం కోరుకుంటున్నాడని ఎందుకనుకోకూడదు?'

'అవును! ఎందుకనుకోకూడదు?' అంటూ నవ్వింది జానకి.


* * *

'మై డియర్ నళినీ!

జానకి ఏమైపోయింది? వుందా? పోడిందా? అసలు నా ఉత్తరాల్ని అందుకుంటోందా? లేక నన్ను మరిచిపోయిందా? వగైరా అనుమానాలతో— ఆవేదనతో— నువ్వు వాపోతూవుంటావని నాకు తెలుసు. అయినా కొంతకాలం నీ సహనానికి పరీక్ష పెట్టక తప్పలేదు. అంత తప్పని పరిస్థితు లేమిటా అని ఆశ్చర్య పోతున్నావుకదూ? ప్రతి మనిషి జీవితంలోనూ— ఏదో ఒక 'విషాద వీచిక వుంటుందని నువ్వొక సారి అన్నావు గుర్తుందా? అది అక్షరాలా సత్యం. మంచి—చెడుల కలయికే ఈ జీవితం! ఈ పాఠాలన్నీ కాలం మనిషికి నేర్పుతుంది. నా జీవితాన్ని నందనవనంగా తీర్చి దిద్దుకోవాలనీ — మరొకరి అధికారపునీడలో— మగ్గిపోవలసిన పరిస్థితి రాకూడదని— నాకు వూహ తెలిసినప్పటి నుంచీ— ఈ లోకంపోకడ అర్థమవుతున్నప్పటి నుంచీ గట్టిగా స్థిరీకరించుకున్నాను. 'ఆడదానికో న్యాయం— మగవాడికో న్యాయం ఎందుకుండాలి?' అనిపించేది. 'ఆడది కాలుజారితే ఆడిపోసుకునే ఈ సంఘం మగవాడి నెందుకు నిలవేయదు?' అనుకునేదాన్ని. నా సందేహాలన్నీ పెద్దదాన్ని అవుతున్నకొద్దీ అర్థమవుతూ వచ్చాయి. అసలైన ముఖ్య లోపం స్త్రీలోని బలహీనత— పిరికితనం! ఇంట్లో తనకు — తనతోడబుట్టిన వాడికి— ఎంతో వ్యత్యాసం వున్నదనీ— ఆడదానికంటే మగాడికి ఎక్కువ ప్రాముఖ్యత నిస్తారని తెలిసినా— ఏమి చేయలేక నిస్సహాయతగా తలవంచే ఆడది— ఇంక సంఘాన్నేలా ఎదిరించ గలదు? నా అభిప్రాయాల్ని ఇంట్లో వ్యక్తం చేయసాగేను. నేను మగపిల్లలతో ఎక్కువగా కలిసి తిరుగుతానని— అది తప్పంటూ చెప్పబోయా డన్నయ్య. 'ఏది తప్పో— ఏది ఒప్పో నేను ఆలోచించుకోగలను!' అన్నాను. దానితో మా ఇద్దరి మధ్య సంఘర్షణ రేగింది. అమ్మ నన్నే మందలించబోయింది. అది సరైన పద్ధతి కాదని— తిడితే ఇద్దర్నీ తిట్టాలి— లేదా నోరుమూసుకుని వూరుకోవాలన్నాను. అమ్మ మరింత నోరు చేసుకుని— నాకేదో దెయ్యం పట్టిందనీ— రకరకాలుగా మాట్లాడింది. ఆడదానికి బయటే కాదు— ఇంట్లో కూడా శత్రువు లుంటారనిపించింది. నాలో పట్టుదల మరింత పెరిగింది. నా కాళ్లమీద నేను నిలబడాలనే ధ్యేయం కలిగింది. దీక్షగా చదివేదాన్ని. కృషికి తగిన ఫలితం కనిపించింది. వెంటనే ఉద్యోగం కూడా దొరికింది. ఉద్యోగ జీవితంలో మరికొన్ని సత్యాలు తెలుసుకున్నాను. ఆడది అంటే— పరువంలో వున్నవాళ్లకే కాదు — మూడు కాళ్ల ముసలివాళ్లకూ— పెళ్లికాని వాళ్లకే కాదు— పాతికమంది బిడ్డల తండ్రికి కూడా ఆసక్తి అనీ— అవకాశం వస్తే వృథాపోనీయరనీను. 'ఓయి భగవంతుడా! ఆడదానికీ సృష్టిలో గొప్ప విలువనిచ్చావు. ఉన్నతమైన బాధ్యతల్ని ఇచ్చావు. కానీ అవి ఎందుకూ కొరకాకుండా అణచి పారేస్తోందీసంఘం!' అనుకునేదాన్నిమూాంగా. నాతో స్నేహం చేయాలనీ— తద్వారా లబ్ధి పొందాలనీ కొందరు ప్రయత్నించారు. 'ఖబడ్దార్!' అంటూ వార్నింగ్ ఇచ్చాను. దాంతో శత్రువర్గం ఏర్పడిపోయింది. వున్నవి— లేనివి రకరకాలుగా అల్లికలతో దుష్ప్రచారం సాగించారు. ఒక్క మూర్తితో మాత్రం కొంతకాలం— చనువుగా— స్నేహంగా వున్నాను. అది కూడా అతను ప్రమాదమైన వ్యక్తి కాడని తెలిసే. దానికే రంగులుపూసి రకరకాలుగా చిత్రించిందీ ప్రపంచం. నేను లక్ష్య పెట్టలేదు. కాని మా ఇంట్లో వాళ్లు లక్ష్యపెట్టి— నన్ను తమ కట్టడిలో వుంచి— తలవంచి పెళ్లిచేయాలని ప్రయత్నించారు. ఇంక నాదోవ నేను చూసుకోక తప్పలేదు. నీకు చెప్పలేదుగానీ— నాకు విశాఖ ట్రాన్స్‌ఫర్ వచ్చినప్పుడు అమ్మ చాలా గొడవ చేసింది. 'తండ్రిలేని పిల్లల్ని కట్టడిలేక పెంచానని ఇప్పటికే లోకం ఆడిపోసుకుంటోంది' అన్నది. 'అవన్నీ వినకు! కొన్ని వినీ విననట్లుంటేనే మంచిది!' అన్నాను. అమ్మ మరింత మండిపడి— 'తక్షణం వెళ్లిపో! నా కూతురీ క్షణానే చచ్చిందనుకుంటాను!'' అన్నది. ''నువ్వింత తేలిగ్గా ఈ బంధం తెంచుకోగలిగినప్పుడు — నాకు లెక్కలోదా?'' అన్నాను. అమ్మ ఏడ్చింది. 'నా కడుపున చెడ బుట్టావే' అంది. నేను విశాఖ వచ్చేశాను. మాటైతే అన్నాను కాని మమకారాలు అంత తేలిగ్గా తెంచుకునేవి కావు. కొన్నాళ్లు నేను చేసిన దాంట్లో తప్పేమైనా వుందా? అని మథన పడ్డాను. నాలో నాకే లోపం కనిపించ లేదు. అమ్మ నమ్మకాలు— ఆవిడ రక్తంలో జీర్ణిం

చుకు పోయిన భయాలు— ఆవిడ వ్యక్తిత్వాన్నలా తీర్చిదిద్దాయి. నా నమ్మకాలు— నా ఆశయాలు నన్నిలా నిలబెట్టాయి.

రఘుతో పరిచయాన్ని మీ ఇంటి కొచ్చినప్పుడు చెప్పాను కదూ? ఒకరి నొకరు బాగా అర్థం చేసుకున్నామని అనిపించినాక— ఒకరి అవసరం మరొకరికి వుంది అని— నిర్ణయించుకున్నాక— వివాహము అయింది. ఇది రిజిస్టర్ మేరేజి. అందుకే మిమ్మల్ని ఆహ్వానించలేకపోయినాను. కొన్నాళ్ళుపోయాక మిమ్మల్ని ప్రత్యేక ఆహ్వానంతో తీసుకొద్దామనుకున్నాను. రఘుకు చెల్లెలు కమల— తల్లి వున్నారు. అందరం ఒకే కుటుంబంగా వుండాల్సిన పరిస్థితి ఇది. ఇద్దరం ప్రత్యేకంగా వుండాలని— నా మనసులో వున్నా— తల్లిని— చెల్లిని వారి దారిన వదిలేసి రమ్మనటం— అన్యాయం అనిపించి— అలాగే ఎడ్జస్టు చేసుకున్నాను. మా అత్తగారికి నాపైవున్న అభిప్రాయ మేమిటో— కొంత కాలానికి తెలిసింది. కట్నాలు— బేరాలు— కానుకలతో సాగిన పెళ్ళికాదు మాది. లాంఛనాలు రాలేదు. కొడుకు మీద పెద్ద ఆశ పెట్టుకుందావిడ. కొడుక్కి ఇచ్చే కట్నంతో కూతురి పెళ్ళి చేయాలనుకుంది. అలా కాకపోవటంతో అసంతృప్తి రగులుకొంది. దానికి కారణంగా నేను కనిపించాను. నా మూలంగా తన కొడుకు ఇలాంటి అన్యాయానికి పాల్పడ్డాడనీ— నమ్మకం పెట్టుకుంది. దాంతో సూటీ— పోటీలు— ఎత్తి పొడుపులు! ఈ వేధవ న్యూసెన్సంతా మొదలెట్టే సరికి— నాకు చిర్రెత్తు కొచ్చేది. అనవసరంగా నోరు పారేసుకుంటే— నేను నోరు మూసుకుని వూరుకునేది లేదని హెచ్చరించాను. కమలకూడా నాతో మాట్లాడటం మానేసింది. చిన్న చిన్న విషయాలకు- రాద్ధాంతం చేయనారంభించిం దావిడ. నేను ఎదుర్కోక తప్పలేదు. వంట చేయమనీ— చిల్లర పనులేవీ ముట్టుకోననీ— మగరాయుడిలా తిరుగుతాననీ— రకరకాలుగా అంటుంటే— నేను సహించలేక పోయాను. "మీరూ ఏ పనిచేయొద్దు! వంట మనిషిని పెట్టు కుందాం! పనిమనిషి వుండనే వుంది! ఇంక అంత పాటుబడి చేయాల్సిన పన్లేమున్నాయి?" అని నచ్చచెప్పబోయాను. రగడ చేయదల్చుకున్న వాళ్లకివన్నీ ఎలా నచ్చుతాయి? రఘుతో పరిస్థితి చెప్పాను. అతనూ చూస్తూనే వున్నాడుగా!— తన తల్లి ఆవేదనను అర్థం చేసుకోమనీ— మా ఇద్దరి జీతాల్లో పొదుపు చేసి— నెలకింత అని వెనకేసి— ఆ డబ్బు కట్నం రూపంలో ఇచ్చి— చెల్లెలి పెళ్ళి చేయటం ముఖ్య కర్తవ్యమనీ— నాకు నచ్చ చెప్పబోయాడు. నా కది రుచించ లేదు. 'కట్నం ఇవ్వడ మంత బుద్ధితక్కువ పని మరోటి లేదు' అన్నాను. 'నేనైతే కట్నం వద్దను కున్నాను. అందరూ అలా అనుకోవద్దూ?" అన్నాడు. అక్కడికేదో తను కారణ జన్ముడయినట్లు. 'అలా అనుకున్నవాడు దొరికినప్పుడే చేయొచ్చు!' అన్నాను. 'అయితే దానికీ జన్మలో పెళ్లి కానేకాదు!' అన్నాడు. 'ఎందుకు కాదు? మీలాంటివాళ్లు నూటి కొకరైనావుండరా!' అన్నాను. "ఇవన్నీ ఎందుకు? నీ సంపాదనలో కానీ రాల్చటం ఇష్టంలేదని చెప్పరాదూ?" అన్నాడు విసుగ్గా. నాకీమాట గుండెల్లో గుచ్చుకుంది. 'నన్నిదా అతను అర్థం చేసుకున్నది?' అనిపించింది. అవును నా కష్టార్జితాన్ని గంగపాలు చేయటం నాకిష్టం లేదన్నాను. 'ఏం చేసుకుంటావా డబ్బు? నెత్తిమీద పెట్టుకుని వూరేగు!' అన్నాడు రెచ్చిపోయి. "ఆ అవసరంలేదు.... బ్యాంకులున్నాయి. అసలైనా అవన్నీ ఇప్పుడనవసరం. డబ్బుతో నా ప్రాణాలంటికె అంటి వుంటే— ఈ సంసారం ఇలా వుండేదికాదు!" అన్నాను మండిపోతూ. "ఏం చూసుకుని నీకీ మిడిసిపాటు?" అన్నాడు తిరస్కారంగా. "ఏం చూసుకుని నువ్వీ మాటలన్నీ అడుగుతున్నావో—అది చూసుకునే. ఆత్మాభిమానం ఒకరిసొత్తేంకాదు.!" అన్నా. నా హృదయంలో పెద్ద అగాధం. ఎక్కడో నా జీవిత మార్గాన్ని— ముళ్లదారిన మళ్లించాను. ఆలోచించి చేసుకున్న నిర్ణయంలో ఎక్కడో అపశృతి! నా కొచ్చే మూడొందల రూపాయిల్లో— వందమాత్రం నేనుంచుకుని— మిగతా రఘుకిస్తూ వచ్చాను. మా వివాహమై ఏడాది కావస్తోంది. ఈ ఏడాది నుంచి నేను వుంచుకున్న డబ్బు— పెళ్లి కాని క్రితం సేవ్ చేసిన డబ్బు కొంత మొత్తం వున్నమాట వాస్తవమే. అయితే అది నేను కమలపెళ్ళికి ఎందుకివ్వాలి? అభిమానాలకుపోతే — నా తమ్ముడు గోపీ లేడా? వాడి చదువుకు నేనెందుకు సాయం చేయకూడదు? ఇవన్నీ ఆలోచిస్తుంటే— కట్నం లేదన్న పేరేగానీ—నా సంపాదన మీద పెద్ద ఆశపెట్టుకున్నట్లు అర్థమైంది. నాలో విచిత్రమైన సంచలనం రేగింది. పగలంతా ఆఫీసులో శ్రమించేది నేను. దానికి ఫలితంగా వచ్చే డబ్బుకు హక్కుదార్లు వాళ్ళానా? ఏడాదిక్రితం వరకూ — వాళ్ళెవరో— నేనెవర్నో. ఈ ఏడాది కాలం



## మీకు సంతానం లేదా?




... చికిత్సలచే, నిరాశచెందిన సోదరీమణులు, మా సలహా సంప్రదింపులచే, దేశములో పలుప్రాంతముల స్త్రీలు, సంతానవతులై పంపిన ప్రశంసా పత్రములనేకము గలవు. **ఉచిత సలహా.** వివరములకు:

**శ్రీనాగార్జున మూలికా కుటీరం**

రైల్వే స్టేషన్‌వద్ద — రామాలయం వీధి,
**తెనాలి - 2.**



**వాయిదాల పదతిపై ట్రాన్‌సిసరు**



ప్రపంచప్రఖ్యాతిగల, శక్తివంతమయిన 3 బ్యాండ్ ఆల్‌వర్‌ల్డ్ 'పెలి-నేషనల్' ఇంగ్లీష్ మోడల్ ట్రాన్‌సిస్టరి గ్యారంటీతో సహా నెలకు రు. 5 ల వంతున చెల్లించి పొందండి ధర: రు. 165. ప్రతి పట్టణమునకు, గ్రామమునకు పంపబడగలదు.

LITZ AGENCIES (WAP)
P. B. 1267, DELHI—6.





మానవ సేవయే మా లక్ష్యం!
ఉచిత సత్‌సాహిత్యం కోసం:
"ధర్మవిజయము" కేంద్రం
పోస్టు బాక్సు నెం. 1654,
సికిందరాబాదు - 3.


# అరిటాకు—ముల్లు

వాళ్లకింత అధికారం ఎలా ఇచ్చింది? నన్ను పాతికేళ్లు పెంచిపెద్దచేసిన— విద్యాబుద్ధులు చెప్పించిన అమ్మకంటే వీళ్లకు ఎక్కువ అధికారం ఎలా వచ్చింది? నేనతన్ని నా జీవితంలో పాలుపంచుకోనిచ్చి—నాతోటి సహప్రయాణీకుడిగా గౌరవించాను. ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోవాలనుకున్న సంసారం ఇలా ఛిద్రమైంది. ఇంతమాత్రానికేనా? అని నీ కనిపిస్తుందేమో. నాకు అలాకాదు. నా మనసులో చెప్పలేని గాయం ఇది. నా ఎన్నికలో ఏదో పొరపాటు జరిగింది. నేనమితంగా విశ్వసించిన రఘులో ఏదో కొత్త స్వరూపం. క్రమక్రమంగా ఇంట్లో కలతలు అధికమైనాయి. అతను నాతో మాట్లాడకపోగా— చీదరించుకున్నట్లుండే ఆ చూపులు భరించలేకపోయేదాన్ని. ఒకరోజు నిలదీసి అడిగేశాను. 'ఏమిటీ పరిస్థితి? ఇలా ఎంతకాలం?' అని. 'నువ్వు నీ పద్ధతిని మార్చుకోలేనంత కాలం!' అన్నాడు. 'ఏం మార్చుకోవాలి?' అడిగాను. "నీజీతం మొత్తం నాకే ఇవ్వాలి. ఇంట్లో అమ్మతో పనిపాట్లు చెయ్యాలి" అన్నాడతను. "అయితే నేను నీ బానిసనా?" బాధగా అన్నాను. "అంతపెద్దమాటలు ఎందుకులే! అర్ధాంగివి కదా!" అన్నాడు నవ్వుతూ. ఆ నవ్వులో ఏదో రాక్షసప్రవృత్తి కనిపించింది. 'అలా ఛస్తే చెయ్యను. నువ్విలాగే నీ అభిప్రాయాల్ని గౌరవించుకుంటూ కూర్చుంటే— ఇంక మనం కలిసివుండడం జరగదు" స్థిరంగా అన్నా. "నన్ను నువ్వు బెదిరిస్తున్నావా? నీకే ఎక్కువ నష్టం! ఆలోచించుకో." నాలో ఆవేదన అగ్నిలా ప్రజ్వరిల్లింది. "రఘూ— నువ్విలా ఎందుకు మారిపోయావు? నా జీతంలో కేవలం మూడోవంతు వుంచుకోటమే—నీకు కంటగింపు అయిందా? మన పరిచయమైన మొదట్లో ఎంత సంస్కారంగా మాట్లాడావు. ఎంత ఉదారత ప్రదర్శించేవు? అదంతా ఏమైపోయింది?"

"ఏమీ కాలేదు. ఇప్పుడు నేనన్నదాన్లో ఏం పొరపాటు వుంది? మెడమీద తలకాయ వున్నవాడెవడూ 'ఇది పొరపాటనడు!'' అన్నాడు. ఇంక అతనితో మాటలనవసరం అనిపించింది. "ఈరోజే వేరుగా వెళ్లిపోతాను!" అన్నా. "వెళ్లు! ఆడది వంటరిగా—అందులోనూ మొగుడ్ని విడిచిన ఆడదానికి—సంఘంలో ఎంత గౌరవం వుంటుందో— ఆ గుణపాఠమేదో నేర్చుకో. తిరిగి ఇక్కడమాత్రం నీకు స్థానం వుండదు!" "నువ్విచ్చినా— నాకక్కర్లేదు ఆ స్థానం. ఇక గుణపాఠమంటారా— నాకు చక్కని గుణపాఠం నేర్పావుగదా! ఇంక వేరే నేర్చుకునేదేమిటి? నేనీలోకాన్ని ఎప్పుడూ లక్ష్యం చేయలేదు. ఇకముందు చేయను కూడా." అన్నా ఆవేశంగా.

"జాగ్రత్త! ఆలోచించుకో. అరిటాకులాంటి జీవితం నీది" అన్న అతనిమాటలు వినగానే కోపంతో వళ్లు తెలియలేదు నాకు.

"ఆ సామెత సంగతి నాకు చెప్పకు! అరిటాకుకాదు—ముల్లు. తల్చుకోవాలేగానీ—నీలాంటి ముళ్లలాంటి వ్యక్తుల్ని— ముళ్ళతోనే ఎదుర్కోగలను. కేవలం ఆడదాని జీవితమే అరిటాకా? మీ జీవితాలు పాషాణ సదృశాలా? ఎంత స్వార్థపూరితమైన అభియోగం! సరే ఆ సంగతిఏమిటో నేనే తేల్చుకుంటాను. నీ ముఖం చూడాలన్నా అసహ్యం వేస్తోంది! ఈక్షణానే వెళ్ళిపోతున్నాను" అంటూ బట్టలన్నీ సర్దుకుని ఆ ఇంటినుంచి బయట పడ్డాను. ఇప్పుడు వేరుగానే వుంటున్నాను నళినీ! త్వరలో రాజమండ్రి ట్రాన్స్‌ఫర్ రావచ్చు. అక్కడకెళ్లి స్థిరపడితేగానీ నా మనసుకుదుట పడదు. ఆఫీసులో మా విషయం పెద్ద ఆకర్షణ అయింది. నన్నుచూసి నవ్వుకోటం— వ్యంగ్యంగా మాట్లాడుకోవటం! ఇవన్నీ నేను పట్టించుకోవటం లేదనుకో. అంతకంటే వాళ్లేం చేస్తారు?

నా కిప్పుడు మూడోనెల. మొదట్లో ఎబార్షన్ చేయించుకుందామనుకున్నాను. ఆలోచిస్తే అది మంచిపని కాదనిపించింది. నాకు పసిపిల్లలంటే అసహ్యమేం లేదు. ఈ సంఘంలో ఎలా పెంచి—పెద్దచేయాలి? అనే అధైర్యంలేదు. పైగా— నా భావాలతో తీర్చిదిద్దాలని కలలు కంటున్నాను. నా వైవాహిక జీవితం ఇలా విచ్ఛిన్న

మైందం?అని నేనిప్పుడు బాధపడటం లేదు. అదొకరకమైన అనుభవం! ఎన్నిరకాల అనుభవాలతో ఈ మానవజీవితం పరిపూర్ణమవుతుంది? చివరిమాటగా ఒక్కటి రాసి—ఈ ఉత్తరం ముగిస్తాను నళినీ!

రఘుతో విడిపోయిన మొదట్లో—నాలో చెప్పలేని భావాలు మెదిలేవి. నేను—నిండుగా నమ్మిన వ్యక్తి— ఇలా ప్రవర్తించాడేమిటి? చిన్నస్పర్థ! పెద్దమాటలతో మనసులు గాయపరచుకుని విడిపోవల్సిన పరిస్థితికొచ్చాం. అనే వేదన— దిగులు— విరక్తి! ఏదో ప్రతీకారచర్య చేయాలనే తపన.... అవమాన భారం—నిరవత. 'నువ్వీ లోకంలో నిస్సహాయురాలివి! ఏదో ఒకటి చేసేయి' అని వత్తిడిచేసేవి. ఆ ఏదో ఒకటి 'ఆత్మహత్య' అనినాకు తెలుసు. మృత్యువంటే నా కెప్పుడూ భయంలేదు. జీవితంలో ఎదురయ్యే పెద్ద—పెద్ద అఘాతాల కంటే — మృత్యువు భయంకరం కాదు. అయినా నేనెందుకు చావాలి? చచ్చి ఏమిటి సాధించాలి? లోకం సానుభూతా? బ్రతికున్నప్పుడు లేనిది—చచ్చాక ఎందుకు? అందుకే బ్రతికి సాధించాలనుకుంటున్నాను. అభిమానం గల స్త్రీ ఎంతటిదిగా — నిక్షేపంలా బ్రతుకగలదని— నిరూపించాలనుకుంటున్నాను. స్త్రీ ఎప్పటికీ అరిటాకు కాదు. ఎవరో మూర్ఖంగా—స్త్రీని భయకంపితను చేయటానికి — అల్లిన సామెత అది. మనసు విరిగిన స్త్రీ ముళ్ళే అవుతుంది. నేనెలా నెగ్గుకొస్తానో అని దిగులు పడుతున్నావా నళినీ? చూస్తూవుగా!—

వుంటాను

ఇప్పటికే నా సొదతో విసిగించిన—

నీ జానకి.

నిట్టూర్చింది నళిని.

'జానకీ!— నీ భావాలు ఉన్నతమైనవే. కానీ — చిన్న చిన్న బలహీనతలు లేకుండా ఏ మనిషీ వుండడు. క్షమా గుణంలేనిది సుఖం వుండదు! జీవితమంతా దాన్ని అన్వేషించటంలోనే పూర్తయిపోతుంది!'' అనుకున్నది భారంగా.

(ఇంకా వుంది)

# బంధువెవ్వరు?—



బులుసు వేంకటరమణయ్య. సేకరణ

మనకు దగ్గరవారల బంధువులూ, మిత్రులూ ఉంటారు. ఏదో ముఖ్య రకం కలిసినవారు బంధువులైతే, మనస్సు కలిసినవారు మిత్రులవుతారు. బంధుమిత్రులలో మిత్రులస్థానమే గొప్పది. సామాన్యంగా — తమవారు ఉన్నతస్థితిలో ఉంటే వారు తమదగ్గరి బంధువులని చెప్పుకోవడం, హీనస్థితిలో ఉంటే అసలు వారు తమ చుట్టాలు కానే కారనటం పరిపాటి.

'చేరినవే చుట్టములు' అని చెప్పిన ట్లుగా మిత్రుడే తగిన బంధువు. ఆస్తిపాస్తులతోడి సంబంధం మాత్రమే ఉంటే నిజమైన బంధువులు కారు; వారు దాయాదులవుతారు. దాయాదులు సాధారణంగా విరోధపరంపరకే చెంది ఉంటారు.

మిత్రులైనవారు కష్టాలలో దగ్గర వుండి అన్నివిధాలా సహాయపడతారు. సుఖంగా ఉన్న సమయంలో తప్పించుకుని దూరంగా ఉంటారు, అప్పుడు తమ అవసరం ఉండదు కాబట్టి. కానీ, మిత్రులుగానూ, బంధువులుగానూ ఉండే వారు అన్ని సమయాల్లోనూ విడిచి పెట్టకుండానే ఉంటారు. కష్టాలలో ఆదుకొన్నట్లు సుఖసమయాల్లో కూడా వారిని వరించుకోవాలి. అలా ఉన్నప్పుడే వారితో ఆనందం కలుగుతుంది.

నిజమైన మిత్రుడికి, నిజమైన బంధువుకీ భేదం లేదు. అట్టి బంధువే మిత్రుడు; మిత్రుడే బంధువు.

ఎప్పుడూ తన్ను విడిచిపెట్టకుండా ఉన్నవాడే బంధువని యీ శ్లోకం చెప్తున్నది.

'ఉత్సవే వ్యసనే ప్రాప్తే
దుర్భిక్షే శత్రుసంకటే,
రాజద్వారే శ్మశానే చ
యస్తిష్ఠతి స బాంధవః.'

ఇంట్లో ఏదైనా ఉత్సవం జరిగినప్పుడూ, కష్టం వచ్చినప్పుడూ, కరవు సంభవించినప్పుడూ, విరోధులవల్ల బాధ కలిగినప్పుడూ, తాను రాజసభలో ఉన్నప్పుడూ చివరకు శ్మశానానికి తీసికొనిపోబడినప్పుడూ సర్వావస్థలలోనూ ఎవ్వడు తన్ను వెంబడించి ఉంటాడో అతడే బంధువు— అని దీని అభిప్రాయం.

అందువల్ల బంధువైనవాడు ఉత్సవ సమయాల్లో తన ప్రక్క నుండాలి. కష్టం వచ్చినప్పుడూ, కరవువల్ల బాధపడుతున్నప్పుడూ అండగా ఉండాలి. శత్రువుల భయాన్ని తొలగించాలి. తాను ఉన్నత స్థితిలో ఉన్నప్పుడూ దగ్గరుండాలి. చివరకు మరణించిన తన్ను శ్మశానానికి తీసుకుని వెళుతున్నప్పుడూ — అంత్యక్రియల వరకూ దగ్గర ఉండాలి.